సాక్షి అనంతపురం

మంగళవారం । 17 । జనవరి । 2023



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.10, సరాసరి రూ.15 పలికింది. మార్కెట్‌కు 225 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



ప్రాణం ఖరీదు రూ.లక్ష

జ్వరంతో బాధపడుతున్న రోగికి డాక్టర్ సూదిమందు వేసిన కాసేపటికే మృతి చెందాడు. దుప్పటి పంచాయితీ చేసి ప్రాణానికి రూ.లక్ష విలువ కట్టారు. 8లో

గరిష్టం/కనిష్టం

31.9°/10.1°

జిల్లా అంతటా సోమవారం చలి తీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా నమోదయ్యాయి. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నకిలీ పత్రాలతో ప్లాట్ విక్రయం

- పోలీసుల అదుపులో ముగ్గురు కేటుగాళ్లు!

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కేటుగాళ్లు ఎక్కువయ్యారు. తమది కాని స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి.. వాటి ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు రంగంలో దిగుతున్నారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా కొనుగోలుదారులు నట్టేట మునగాల్సిందే. ఇలాంటి కోవకు చెందినదే ఒకటి అనంతపురంలో వెలుగు చూసింది. బాధితుడి కథనం మేరకు... నగరంలోని బళ్లారి బైపాస్ సమీపాన ఖాళీ స్థలాన్ని(ప్లాట్) ఉరవకొండకు చెందిన రఫీ అనే ప్రైవేట్ సర్వేయర్, మరో ఇద్దరు వ్యక్తులు కలిసి లక్ష్మీనారాయణ అనే వ్యక్తి వద్ద అమ్మకానికి పెట్టారు. ఆ స్థలానికి సంబంధించి కొన్ని పత్రాలు అందజేశారు. ఈ ప్లాట్‌కు రూ.60లక్షలు బేరం కుదుర్చుకుని.. అందులో రూ.15లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుని అగ్రిమెంట్ చేయించి.. ఒక సెట్ పత్రాలు లక్ష్మీనారాయణకు అందజేశారు. కొనుగోలుదారుడు ఈ పత్రాలను తెలిసిన వారితోను, రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ చూపించగా.. నకిలీవని తేలింది. రఫీ బృందం తనను మోసం చేశారని గ్రహించిన లక్ష్మీనారాయణ ఎస్పీ ఫక్కీరప్పను ఆశ్రయించాడు. ఎస్పీ ఈ కేసును అనంతపురం రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ పోలీసులు దీనిపై విచారణ చేపట్టి.. నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు సమాచారం.

ఫేషియల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, కింది స్థాయి సిబ్బంది అందరూ ఫేషియల్ అటెండెన్స్‌కు సంబంధించిన ఏపీఎఫ్ఆర్ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ ఉదయం 10.10 గంటల్లోగా, సాయంత్రం 5.30 గంటల తరువాత అటెండెన్స్ వేయాల్సి ఉంటుందని తెలిపారు. జీతభత్యాలకు సంబంధించిన అన్ని వ్యవహారాలు ఈ యాప్‌కు లింక్ అయి ఉంటాయని వివరించారు. మంగళవారం నుంచి యాప్‌లోనే అటెండెన్స్ వేయాలని సూచించారు.

కర్మాగారంలో కార్మికుడి దుర్మరణం



మృతుడు మిథిలేష్ కుమార్

బొమ్మనహాళ్: మండలంలోని హరేసముద్రం పరిధిలో ఉన్న శాతవాహన ఇస్పాత్ కర్మాగారంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బీహార్‌లోని గయా సమీపంలో ఉన్న పాత్రీ గ్రామానికి చెందిన మిథిలేష్ కుమార్ (20), మిథేలేష్ భారతి అన్నదమ్ములు. పొట్ట కూటి కోసం వలస వచ్చిన వీరు శాతవాహన ఇస్పాత్ కర్మాగారంలో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఆదివారం విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఐరన్ పైపు మిథిలేష్ కుమార్ తలపై పడడంతో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. ప్రాణపాయంలో ఉన్నాడనే ఉద్దేశంతో ఫ్యాక్టరీ యాజమాన్యం వెంటనే బళ్లారి విమ్స్‌కు తరలించింది. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు మిథిలేష్ భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

తగ్గని చలి తీవ్రత

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో పది రోజులుగా చలి కొనసాగుతోంది. రాత్రిళ్లు చాలా మండలాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకు చలి వణికిస్తోంది.

● నమో నారసింహా..





పార్వేట కోసం తెచ్చిన కుందేలును చూపుతున్న భక్తులు

ఖాద్రీశుడి పార్వేట ఉత్సవంలో పాల్గొన్న భక్త జనం

కదిరి: కనుమ రోజు అయిన సోమవారం ఖాద్రీశుని పార్వేట ఉత్సవం కనులపండువగా జరిగింది. ఓ చేత విల్లు.. మరో చేత బాణం ధరించి పార్వేటకు వచ్చిన ఖాద్రీశుడిని చూసిన భక్త జనం 'నమో నారసింహా' అంటూ చేసిన నామస్మరణతో కదిరి కొండ (స్తోత్రాద్రి) ప్రాంతం ప్రతిధ్వనించింది. ప్రధాన అర్చకులు భక్తులకు పార్వేట ఉత్సవ విశిష్టతను వివరించారు. ఆచారం ప్రకారం కుందేళ్లను జనం మధ్యకు వదలగానే భక్తులు వెంటపడి పట్టుకుని, శరీర భాగాలను తలా ఓ ముక్క లాక్కున్నారు. అంతకు ముందు కదిరి కొండ వద్ద పూజలు ముగించుకున్న శ్రీవారు కుమ్మరవాండ్లపల్లి వద్ద ఉన్న పాలు ఆరగింపు మంటపం వద్దకు చేరుకున్నారు. ఆచారం ప్రకారం యాదవులు స్వామివారికి పాల పొంగులు నిర్వహించారు. నారసింహుడు పాలు ఆరగించిన తర్వాత భక్తులకు దర్శన భాగ్యం కల్గించారు.



కదిరి కొండ వద్ద కొలువుదీరిన ఖాద్రీశుడు

ఉమ్మడి జిల్లాలో కార్ల విక్రయ కంపెనీలు	10కి పైనే
కనిష్టంగా కారు విలువ	రూ.7 లక్షలు
గరిష్టంగా	రూ.40 లక్షలు
నెలకు సరాసరి అమ్మకాలు	400 పైనే
నెలకు కార్ల అమ్మకాల టర్నోవర్	రూ.320 కోట్లు
ఏడాదికి సగటున అమ్మకాల విలువ	రూ.3,800 కోట్లు



దూసుకెళ్తున్న కార్లు

- జిల్లాలో నెలకు సగటున 400 కార్ల విక్రయాలు
- ఐదేళ్ల కిందట నెలకు 80 కార్లు అమ్ముడైతే గొప్ప
- ఏడాదికి రూ.3,800 కోట్లకు పైగా టర్నోవర్



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో కార్ల అమ్మకాలు దూసుకెళ్తున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో ఇప్పుడు నాలుగు చక్రాల వాహనాలకు డిమాండ్ పెరిగింది. ఒకప్పుడు కారు హోదాగా భావించే సగటు కుటుంబాలు.. ఇప్పుడు నిత్యావసరంగా భావిస్తున్నాయి. సొంత ఇల్లు ఎంత ముఖ్యమో కారు ఉండటమూ అంతేననే ఆలోచన ఏర్పడింది. ముఖ్యంగా కోవిడ్ అనంతరం చిన్న చిన్న ఉద్యోగులు కూడా కారు వైపు మొగ్గు చూపుతున్నారు. కుటుంబంతో కలిసి సొంతకారులో ప్రయాణించాలన్న ఆలోచన బలంగా ఏర్పడింది.

కార్లకు భారీ డిమాండ్..

ఐదేళ్ల క్రితం అనంతపురం జిల్లా కేంద్రంగా మహా అంటే నెలకు 80 నుంచి 100 కార్లు అమ్ముడయ్యేవి. తాజా గణాంకాలు చూస్తే నెలకు 400కు పైగా అమ్ముడవుతున్నాయి. దీన్నిబట్టి కార్ల డిమాండ్ ఎలా ఉందో అంచనా వేయచ్చు. కియా, మహీంద్రా, హ్యుందాయ్, మారుతి, టాటా వంటి కార్లకు బాగా డిమాండ్ ఉంది. కారు బుక్ చేసుకున్న తర్వాత కనీసం మూడు మాసాలు వేచి చూడాల్సిన పరిస్థితి ఉన్నట్టు షోరూం నిర్వాహకులు చెబుతున్నారు. కొన్ని కార్లకు 6 మాసాలు కూడా పడుతోంది. పండుగలు, ప్రత్యేక పర్వదినాల వేళ 500 కార్లు అమ్ముడైన సందర్భాలున్నాయి.

కుటుంబ ప్రయాణాలపై మొగ్గు..

ఒకప్పుడు బస్సు, రైలు ప్రయాణాలు ఎక్కువ. ఇప్పుడు రూ.40 వేలు వేతనం తీసుకునే ఉద్యోగి కూడా కుటుంబంతో కలిసి కారులో ప్రయాణం చేయాలనుకుంటున్నారు. దీంతోపాటు సులభతర వాయిదాల్లో లోన్లు లభిస్తున్నాయి. కోవిడ్ పరిస్థితుల నేపథ్యంలో కార్లలో ప్రయాణమే మంచిదన్న అభిప్రాయంలో ఉన్నారు. కొత్త కార్లకే కాదు సెకండ్ హ్యాండ్ కార్లకూ ఇప్పుడు మంచి మార్కెట్ ఉన్నట్టు ఆటోమొబైల్ నిపుణులు చెబుతున్నారు.

కొనుగోలు శక్తి పెరిగింది

ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగింది. చిన్న చిన్న ఉద్యోగులు కూడా కారు కొనుక్కోవాలనే ఆలోచనలో ఉన్నారు. గతంతో పోల్చితే ఇప్పుడు చాలా ఎక్కువ మార్కెట్ ఉంది. ముఖ్యంగా కోవిడ్ అనంతరం జిల్లాలో కార్ల అమ్మకాల మార్కెట్ పెరిగింది.

– వంశీ, జనరల్ మేనేజర్, మహీంద్రా కంపెనీ

అక్కడ జాప్యం జరుగుతోందని..

మాది కృష్ణా జిల్లా కలిదిండి. మహీంద్రా ఎక్స్‌యూవీ 700 కొనాలనుకున్నా. కానీ విజయవాడలో 7 మాసాలు వెయిటింగ్ అని చెప్పారు. తెలిసిన వాళ్లుంటే అనంతపురంలో కొన్నా. ఈ వారంలో డెలివరీ ఇస్తున్నారు. ఆ వాహనం నాకు బాగా ఇష్టం.

– ఎం.నాగరాజు, కలిదిండి

ఆదాయం గణనీయంగా పెరిగింది

రవాణాశాఖకు ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ. 206.42 కోట్లు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. డిసెంబర్ నాటికి రూ.154 కోట్లు టార్గెట్ కాగా రూ. 132 కోట్లు వసూలైంది. ఇందుకు కారణం వాహనాల కొనుగోలు పెరగడమే. ముఖ్యంగా కార్ల కొనుగోలు శాతం భారీగా పెరిగింది. మధ్యతరగతి వారు సైతం కార్లను కొనుగోలు చేస్తున్నారు.

– శివరామప్రసాద్, ఉపరవాణా కమిషనర్, అనంతపురం

పరారీలో ఫిజియోథెరపిస్ట్

- రూ.3 కోట్ల వరకు అప్పులు
- ఐపీ నోటీసులు జారీ చేసి.. అజ్ఞాతంలోకి..
- లబోదిబోమంటున్న బాధితులు



రఘువీర ప్రసాద్

అనంతపురం సప్తగిరి సర్కిల్: అప్పులు చేసి.. తిరిగి ఇవ్వకుండా ఫిజియోథెరపిస్ట్ పరారైన ఘటన అనంతపురంలో వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసనగర్‌లో ఫిజియోథెరపిస్ట్ రఘువీరప్రసాద్ ఫిజియోథెరపీ సెంటర్ నిర్వహిస్తున్నాడు. తనవద్దకు ఫిజియోథెరపీ కోసం వచ్చే వారితో పాటు స్నేహితులు, సన్నిహితుల నుంచి అప్పులు తీసుకున్నాడు. మంచివాడని, ఆయన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో తమ డబ్బు ఎక్కడికి పోతుందిలే అన్న ధైర్యంతో అందరూ ధర్మ వడ్డీకి ఇచ్చారు. అలా రూ.3 కోట్ల వరకు అప్పులు చేసిన రఘువీర ప్రసాద్ రియల్ ఎస్టేట్, షేర్ మార్కెట్లో పెట్టుబడి పెట్టాడు. ఆ వ్యాపారం ఏమైందో తెలీదు కానీ తనవద్ద డబ్బులు లేవని, అప్పు చెల్లించే పరిస్థితిలో లేనని ఐపీ నోటీసులు పంపాడు. ఫిజియో థెరపిస్ట్ ఇంటికి తాళం వేసి భార్య, పిల్లలు, తల్లితో కలిసి పరారయ్యాడు. ధర్మ వడ్డీ పేరుతో తమ వద్ద డబ్బు తీసుకుని ఇప్పుడు నోటీసులు పంపితే ఎలా అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకుని ఎగ్గొట్టే చర్యలకు పాల్పడుతున్న ఇతనిపై కఠిన చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

కార్లపై మోజుతో చోరీలు

- కార్‌డెకార్స్ దుకాణాలే టార్గెట్
- దొంగను పట్టుకున్న అనంత పోలీసులు
- 2 కార్లు, ఇతర సామగ్రి స్వాధీనం



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు.. చిత్రంలో రికవరీ చేసిన వస్తువులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కార్లపై మోజుతో వాటిని అపహరిస్తున్న దొంగను అనంతపురం త్రీటౌన్, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం అనంతపురం త్రీటౌన్ పోలీసు స్టేషన్ ఆవరణలో నగర ఇన్‌చార్జ్ డీఎస్పీ మహబూబ్‌బాషా, త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు విలేకరులకు వెల్లడించారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపల్లికి చెందిన కరుటూరి సాయి సత్యతేజ స్పిన్నింగ్ మిల్లులో కూలి పనులు చేసేవాడు. ఇతనికి చిన్నప్పటి నుంచి కార్లు నడపడమంటే చాలా ఇష్టం. సొంతంగా కొనుగోలు చేయాలని తపించేవాడు. దీనికి తోడు జల్సాలకు అలవాటుపడ్డాడు. కూలి పనుల ద్వారా వచ్చే డబ్బుతో ఇవేవీ తీరలేదు. ఎలాగైనా డబ్బు సంపాదించి సొంతంగా కారు కొనుక్కోవాలని భావించాడు. ఈ నేపథ్యంలోనే తాళం వేసిన దుకాణాలను లక్ష్యంగా చేసుకుని రాత్రి వేళ దొంగతనాలు మొదలు పెట్టాడు. గుంటూరు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, రావులపాలెం, ఆలమూరు, కొత్తపేట, ఏలూరు, విశాఖపట్నం పోలీసు స్టేషన్ల పరిధిలో 25 దొంగతనాలు చేశాడు. ఆ కేసుల్లో అరెస్టయి జువైనల్ హోంకు కూడా వెళ్లొచ్చాడు. పెద్దవాడయ్యాక కూడా అతనిలో మార్పు రాలేదు. యథావిధిగానే షాపుల షట్టర్ తాళాలను ఇనుప రాడ్డుతో పగులగొట్టి దొంగతనాలు చేశాడు. అనంతపురం నగరంలో కూడా ఈ తరహా చోరీలు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా నగర శివారులోని కార్‌డెకార్స్ దుకాణాల్లో వరుస చోరీలు జరిగాయి. దీంతో కరుటూరి సాయి సత్యతేజపై పోలీసులు నిఘా పెంచారు. ఇన్‌చార్జ్ డీఎస్పీ మహబూబ్ బాషా పర్యవేక్షణలో త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు, సిబ్బంది బృందంగా ఏర్పడి దొంగను అనంతపురంలోని పీటీసీ సమీపంలో అరెస్టు చేశారు. అతని నుంచి రూ.11,82,800 విలువ చేసే 2 కార్లు, ఎలక్ట్రికల్ ప్రాజెక్టర్లు, సౌండ్ స్పీకర్లు, కంప్యూటర్ సామగ్రి, ల్యాప్‌టాప్ , సెల్‌ఫోన్‌తో పాటు రూ.17 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

నైపుణ్యాభివృద్ధికి శ్రీకారం

- విద్యా సామర్థ్యాల పెంపునకు చర్యలు
- మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఎల్‌ఐపీ
- 335 ఉన్నత పాఠశాలల్లో సైన్స్ క్లబ్బులు
- క్రీడల నిర్వహణకు రూ.3.54 కోట్ల నిధులు

అనంతపురం: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. గతానికి భిన్నంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఆయా కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు కనీస భాషా పరిజ్ఞానం, అంక గణిత సామర్థ్యాల పెంపునకు చర్యలు చేపట్టింది. అభ్యసనా సామర్థ్యాల్లో వెనుకబడిన పిల్లలకు ఆయా కార్యక్రమాల ద్వారా శాస్త్రీయ విద్య అలవడేలా కృషి చేస్తోంది. ప్రాథమిక స్థాయిలో మూడో తరగతిలోపు చదువుతున్న 90,587 మంది విద్యార్థులకు భాషా నైపుణ్యాల పెంపునకు రోజుకు ఒక కొత్త పదం నేర్చుకునేలా ఎల్‌ఐపీ (లాంగ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్) నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు రోజూ తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆయా కార్యక్రమాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడంతో పాటు జిల్లాలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న 1,52,759 మంది విద్యార్థులకు పిక్టోరల్ డిక్షనరీలు అందించారు.



పాఠశాలలో క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్)

శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తించేలా..

లెక్కలు, సైన్స్ సబ్జెక్టులపై భయాన్ని తొలగించి ఆసక్తి పెంచేలా ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 335 ఉన్నత పాఠశాలల్లో సైన్స్, మ్యాథ్స్ క్లబ్బులు ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణకు ప్రతి పాఠశాలకు రూ.10 వేల చొప్పున నిధులు కేటాయించింది. విద్యార్థులు భవిష్యత్తులో ఏ కోర్సు ఎంపిక చేసుకుంటే అవకాశాలు ఎలా ఉంటాయనే అంశంపై అవగాహన కల్పించేందుకు హైస్కూల్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాంకు రూపకల్పన చేసి ఆన్‌లైన్‌లో అమలు చేస్తోంది.

క్రీడా నైపుణ్యాలు పెంపొందించేలా...

క్రీడలతోనే మానసిక వికాసం సాధ్యమనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించేందుకు చర్యలు చేపట్టింది. తాజాగా జిల్లా, రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో క్రీడా పరికరాలు, ఫిజికల్ ఎడ్యుకేషన్ నిర్వహణకు రూ.3.54 కోట్ల నిధులు విడుదల చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎనిమిది నుంచి పదో తరగతి వరకు మొత్తం 586 పాఠశాలలు ఉండగా, రూ.1.46 కోట్ల నిధులు విడుదల చేసింది. 12వ తరగతి వరకు ఉన్న సీనియర్ సెకెండరీ పాఠశాలలకు రూ.28 లక్షల నిధులు వచ్చాయి. మొత్తం 2,730 ప్రాథమిక పాఠశాలలకు రూ.1.36 కోట్లు, మొత్తం 434 ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.43.40 లక్షల నిధులు అందాయి. మొత్తం అన్ని పాఠశాలలకు కలిపి 3.54 కోట్ల నిధులతో పాఠశాల క్రీడా పరికరాల వినియోగానికి వెచ్చించవచ్చు. క్రీడా ఆణిముత్యాలను వెలుగులోకి తీసుకరావడంలో భాగంగా గ్రామీణ స్థాయి నుంచే క్రీడా పోటీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

భాషలపై ప్రత్యేక తర్ఫీదు

తెలుగు, ఇంగ్లిష్, హిందీ వంటి భాషలు నేర్చుకుంటే భాషా సామర్థ్యాలు అలవడతాయి. తద్వారా విద్యార్థిలో మానసిక వికాసంతో పాటు సృజనాత్మకత ఆలోచనలు రావడానికి వీలు కలుగుతుంది. ఈ నేపథ్యంలో పునాది స్థాయి నుంచే విద్యార్థికి భాషలపై పట్టు సాధించే రీతిలో ప్రత్యేక తర్ఫీదునిస్తున్నాం. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించేందుకు రూ.3.54 కోట్ల నిధులు విడుదల అయ్యాయి.

– కె.తిలక్ విద్యాసాగర్, ఏపీసీ, సమగ్రశిక్ష

సరదాల సంక్రాంతి

మూడు రోజుల పండుగ సంక్రాంతిని ప్రజలు సంతోషంగా జరుపుకొన్నారు. తొలిరోజు శుక్రవారం భాగ్యాలనిచ్చే భోగి, రెండో రోజు సరదాల సంక్రాంతి, మూడో రోజు ఆదివారం కమ్మనైన వంటలతో కనుమ పండుగ చేసుకున్నారు. జిల్లా అంతటా ఏ ఇంట చూసినా రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు నూతన శోభను తీసుకొచ్చాయి. సంస్కృతీ సంప్రదాయాలతో పాటు సందేశాత్మక ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సంప్రదాయ దుస్తులతో బంధుమిత్రులతో సంతోషంగా గడిపారు. ఇళ్లు, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఉరవకొండ రంగావీధిలో 'అమ్మాయిలను రక్షించండి' అంటూ వినూత్నంగా ముగ్గు వేసిన అమ్మాయి



తాడిపత్రి మెయిన్ బజార్‌లో ఇంటి ముందు వేసిన సంక్రాంతి పండుగ విశిష్టతను చాటే ముగ్గు

రేపు బాలికల హాకీ జట్ల ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా సబ్ జూనియర్, జూనియర్ బాలికల హాకీ జట్టు ఎంపికను ఈ నెల 18న ఉదయం 10 గంటలకు ఆర్డీటీ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు ఏపీ హాకీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ తెలిపారు. సబ్ జూనియర్ జట్టుకు 2006 జనవరి 1 తరువాత జన్మించిన వారు అర్హులని, జూనియర్ విభాగంలో 2003 జనవరి 1 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పదో తరగతి మార్క్స్ మెమోతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన జూనియర్ బాలికల హాకీ జిల్లా జట్టు ఈ నెల 28 నుంచి అనకాపల్లి జిల్లా యలమంచిలిలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. సబ్ జూనియర్ విభాగం పోటీల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు.

క్లుప్తంగా

రాసింది ఒకటి.. చేసింది మరొకటి

- 'స్టార్' డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాకం



హరిప్రసాద్ రెడ్డికి వైద్యుడు రాసిచ్చిన టెస్టు చీటి

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని స్టార్ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకుల తీరు రోగులను ఆవేదనకు గురి చేస్తోంది. బాధితులు తెలిపిన మేరకు... మల విసర్జన సమయంలో ఇబ్బంది పడుతున్న జమ్మలమడుగుకు చెందిన ప్రకాష్‌రెడ్డి సోమవారం ఉదయం అనంతపురంలోని తన సోదరుడి కుమారుడు హరిప్రసాదరెడ్డితో కలసి ఓ ప్రైవేట్ ఆసపత్రికి వెళ్లి చూపించుకున్నాడు. ఆ సమయంలో ఇద్దరికీ ఎంఆర్‌ఐ పిస్టులాగ్రామ్ లిమిట్ కట్స్ వైద్య పరీక్ష చేయించుకుని రావాలంటూ స్టార్ డయాగ్నస్టిక్ సెంటర్‌కు డాక్టర్ ప్రణీత్‌రెడ్డి రెఫర్ చేశారు. దీంతో వారు స్టార్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో పేషెంట్ ఐడీ నెం: 230116-026(హరిప్రసాద్‌రెడ్డి), 230116-025(ప్రకాష్‌రెడ్డి)తో పరీక్ష చేయించుకున్నారు. ఇందుకుగాను ఇద్దరికీ కలిపి రూ.14 వేలు బిల్లు అయింది. అనంతరం రిపోర్టు తీసుకెళ్లి వైద్యుడికి చూపిస్తూ డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఒక్కొక్కరికి రూ.7వేలు చొప్పున బిల్లు అయిందంటూ వివరించారు. దీంతో డాక్టర్ అసహనానికి గురవుతూ తాను రాసిచ్చిన పరీక్షలకు సంబంధించి ఒక్కొక్కరికి రూ.3,500 మాత్రమే అవుతుందని, రూ.7 వేలు చొప్పున ఎలా తీసుకుంటారంటూ ప్రశ్నించాడు. ఇదే విషయాన్ని డయాగ్నస్టిక్ సెంటర్‌కు వెళ్లి బాధితులు ప్రశ్నిస్తే అక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి పంపారు. డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులు తమను మోసం చేశారంటూ ఈ సందర్భంగా బాధిత రోగులు వాపోయారు. దీనిపై స్టార్ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకుల్లో ఒకరైన దాదాగాంధీ మాట్లాడుతూ.. డాక్టర్ సూచన మేరకు తాము వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

దుర్గంలో దోపిడీ దొంగల బీభత్సం

- పొట్టేళ్లను అపహరించబోయి స్థానికులకు పట్టుబడ్డ వైనం
- 30 రోజుల వ్యవధిలోనే 50 జీవాల అపహరణ
- పట్టుబడ్డ వారు ఆత్మకూరు మండలం సనప వాసులుగా గుర్తింపు
- కేసు నమోదు చేసిన పోలీసులు





పొట్టేళ్లను ఎత్తుకెళ్లేందుకు వినియోగించిన వాహనం, పట్టుబడ్డ నిందితులు

రాయదుర్గం: పట్టణ పరిధిలోని పైతోటలో ఆదివారం అర్ధరాత్రి దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. సంక్రాంతి పర్వదినాన్ని దృష్టిలో ఉంచుకుని తమపని సులువుగా చక్కబెట్టుకోవచ్చునే ఆశతో రంగంలోకి దిగిన దొంగలను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు.. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పైతోట లోని నాయకుల రఘు నివాసం వద్ద టాటామ్యాజిక్ లగేజీ వాహనం ఆగింది. దీంతో రఘుకు అనుమానం వచ్చి లైట్లు వేయగానే వాహనం ముందుకు కదిలింది. కొంత దూరం వెళ్లగానే పెట్రోల్ బంకు సమీపాన మధు అనే యజమాని పొలంలో 15 పొట్టేళ్లు ఉన్నట్లు ముందే గుర్తించిన దోపిడీదారులు వాటిని ఎత్తుకేళ్లేలా ప్రణాళిక రచించారు. కంచెపైకి ఎక్కి మందలోకి ఇద్దరు దూకుతుండగా అటుగా వెళుతున్న కబడ్డీ క్రీడాకారుడు ఓబులేసు గుర్తించారు. దీంతో లగేజీ వాహనాన్ని అనుమానం రాకుండా కర్ణాటక వైపుగా తీసుకెళ్లారు. కాసేపటి తర్వాత వాహనం వెనుదిరిగి మధు పొలం వద్దకు వస్తుండగా స్థానికులతో కలసి ఓబులేసు అడ్డుకున్నాడు. మందలోకి ఇద్దరు దూకిన విషయాన్ని తాను చూశానని, వారు ఎవరో చెప్పాలని గట్టిగా ప్రశ్నించాడు. దొంగతనానికి వచ్చామని డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి అంగీకరించడంతో వాహనానికి లైట్లు వేయకుండా పొట్టేళ్ల మందవద్దకు తీసుకెళ్లాలని సూచించి, వాహనంలోనే స్థానికులు అనుసరించారు. మంద వద్దకెళ్లి వాహనం ఆపగానే ఐదు పొట్టేళ్లను తీసుకొచ్చి వాహనంలోకి ఎక్కిస్తుండగా పట్టుకోబోయారు. ఆ సమయంలో ప్రతిఘటిస్తూ ఓ వ్యక్తి తప్పించుకుని పారిపోయాడు. డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి పట్టుబడ్డాడు. పట్టుబడ్డ ఇద్దరినీ పోలీసులకు అప్పగించారు. కాగా, 30 రోజుల వ్యవధిలోనే 50 గొర్రెల అపహరణ జరిగిందని, ఇందులో వీరి భాగస్వామ్యంపై తమకు అనుమానం ఉందంటూ స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టుబడిన ఇద్దరినీ ఆత్మకూరు మండలం సనప గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్రాణం ఖరీదు రూ.లక్ష!

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పరుగులు తీస్తున్న నేటి రోజుల్లో రాతియుగం నాటి అనాగరిక సంస్కృతికి తెరలేపారు కొందరు. వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందితే... రూ.లక్ష పరిహారం చెల్లించేలా దుప్పటి పంచాయితీ చేశారు. పెద్దల పంచాయితీకి వైద్యాధికారులు, పోలీసులూ తలొగ్గారు. ఆదివారం నిశిరాత్రి జరిగిన ఈ దారుణం సోమవారం తెల్లారేసరికి గుట్టుచప్పుడు కాకుండా తొక్కేశారు.

- సూది మందు వికటించి వ్యక్తి మృతి
- పంచాయితీతో ధర నిర్ణయించిన వైనం



మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య (చిత్రంలో) కుమారుడు

గుత్తి రూరల్: సూది మందు వికటించి ఓ వ్యక్తి మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... గుత్తి మండలం తొండపాడుకు చెందిన నల్లబోతుల రంగయ్య (45), సునీత దంపతులు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ రంగయ్య కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. జ్వరంతో బాధపడుతున్న రంగయ్య ఆదివారం రాత్రి కుమారుడు సాయంతో గుత్తిలో ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ కృష్ణప్రసాద్ నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌కు వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. డాక్టర్ సూది మందు వేసిన కాసేపటికి రంగయ్య అపస్మారకస్థితికి చేరుకున్నాడు. దీంతో వైద్యుడి సూచన మేరకు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. అప్పటికే రంగయ్య మృతి చెందాడు. దీంతో డాక్టర్ కృష్ణప్రసాద్ వైద్యం సరిగా చేయకపోవడం వల్లనే రంగయ్య మృతి చెందాడంటూ బంధువులు, కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు. అప్పటికే అక్కడకు చేరుకున్న డాక్టర్ కృష్ణప్రసాద్‌పై దాడికి యత్నించారు. సకాలంలో అక్కడకు చేరుకున్న సీఐ వెంకటరామిరెడ్డి, సిబ్బంది వెంటనే ఆందోళనకారులను చెదరగొట్టారు.

డ్యూటీ సమయంలో ప్రైవేట్ క్లినిక్‌లో

ఇటీవల బదిలీపై గుత్తి ప్రభుత్వాస్పత్రిలో వైద్యుడిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కృష్ణప్రసాద్.. స్థానికంగానే ఓ ప్రైవేట్ క్లినిక్ నిర్వహిస్తూ అదనపు ఆదాయంపై దృష్టిసారించారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి కాల్ డ్యూటీలో ఉన్న ఆయన... తన సొంత క్లినిక్‌లో పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న రంగయ్య కుటుంబసభ్యులు నేరుగా ప్రైవేట్ క్లినిక్‌కు చేరుకున్నారు. పరీక్షించిన డాక్టర్ కృష్ణాప్రసాద్ సూది మందు వేసిన కాసేపటికి రంగయ్య అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పరిస్థితి చేజారుతున్నట్లు గమనించిన డాక్టర్ వెంటనే... ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని రోగి కుటుంబసభ్యులకు సూచించినట్లు తెలిసింది. ఘటనపై డాక్టర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. జ్వర తీవ్రత కారణంగానే రంగయ్య మృతి చెందాడని పేర్కొన్నారు. రోగి ప్రాణాలు కాపాడేందుకు తాను చేసిన ప్రయత్నాలు వివరించారు.

పంచాయితీ పెద్దలు పోలీసులేనా?

రంగయ్య మృతికి డాక్టర్ కృష్ణ ప్రసాద్‌నే కారణమంటూ పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేయాల్సిన పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ దుప్పటి పంచాయితీకి తెరలేపినట్లు సమాచారం. వైద్యుడిని కాపాడే క్రమంలో బాధిత కుటుంబ సభ్యులను రాజీ చేసి రూ.లక్ష పరిహారాన్ని డాక్టర్ కృష్ణప్రసాద్ చెల్లించేలా ఒప్పందం చేసినట్లు తెలిసింది. దీంతో వివాదం సద్దుమణిగినట్లు సమాచారం.

'108'లో ప్రసవం



నవజాత శిశువును అప్పగిస్తున్న ఈఎంటీ రమాదేవి

యల్లనూరు: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. వివరాలు... యల్లనూరు మండలం కల్లూరు గ్రామానికి చెందిన సోమేసులు, కవిత దంపతులు. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడోసారి గర్భం దాల్చిన ఆమెకు నెలలు నిండి శనివారం రాత్రి పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు సమాచారం అందించడంతో 108 సిబ్బంది అక్కడకు చేరుకుని ఆమెను తీసుకుని అంబులెన్స్‌లో తాడిపత్రి ఆస్పత్రికి బయలుదేరారు. మార్గమధ్యంలో కొనగుంటపల్లి వద్దకు చేరుకోగానే నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ రమాదేవి సూచన మేరకు పైలెట్ కొండయ్య వాహనాన్ని రోడ్డు పక్కన ఆపాడు. కాసేపటికి ఈఎంటీ సహకారంతో పండంటి మగబిడ్డకు కవిత జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను తాడిపత్రిలోని ఆస్పత్రికి చేర్చారు. పరీక్షించిన వైద్యులు తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని ధ్రువీకరించారు.

వంచకుడి అరెస్టు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడంటూ యువతి ఆత్మహత్యాయత్నం చేసిన కేసులో నిందితుడిని దిశ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ చిన్న గోవిందు సోమవారం వెల్లడించారు. అనంతపురానికి చెందిన ఓ యువతి, కణేకల్లు నివాసి యశ్వంత్‌కుమార్ వశిష్ఠ ఏడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలోనే శారీరకంగా ఇద్దరూ ఒక్కటయ్యారు. పెళ్లి చేసుకోవాలని యువతి ఎన్నిమార్లు ప్రాధేయపడిన వశిష్ఠ పెడచెవిన పెడుతూ వచ్చాడు. దీంతో తాను మోసపోయినట్లుగా గుర్తించిన యువతి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నిందితుడిని అరెస్ట్ చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడి మృతి

బుక్కరాయసముద్రం: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యాచకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రంలోని గాంధీనగర్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో కొంత కాలంగా ఓ గుర్తు తెలియని వృద్ధుడు (70) తలదాచుకుంటూ భిక్షాటనతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆలయంలోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా దూసుకెళ్లాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక వృద్ధుడు మృతి చెందాడు. ఘటనపై గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు బీకేఎస్ పోలీసులు తెలిపారు.

టీడీపీ, ఎల్లో మీడియా కట్టుకథ నమ్మొద్దు

- దోబీఘాట్ స్థలాన్ని ఆక్రమించింది టీడీపీ నేతనే
- రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మీసాల రంగన్న



దోబీఘాట్ స్థలాన్ని పరిశీలిస్తున్న మీసాల రంగన్న

రాప్తాడు రూరల్: అనంతపురం మండలం ఆకుతోటపల్లిలో సర్వే నంబర్ '122-1బి' లో దోబీఘాట్‌కు కేటాయించిన స్థలాన్ని టీడీపీకి చెందిన నేత ఆక్రమించుకున్నాడని, ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చుతూ టీడీపీ, ఎల్లోమీడియా కట్టుకథను ప్రచారం చేస్తున్నాయంటూ రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మీసాల రంగన్న మండిపడ్డారు. సోమవారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు నారాయణరెడ్డి, సీఐఐ (ఎంఎల్) పెద్దన్న, సీపీఐ వృత్తిదారుల సంఘం లింగమయ్య, రజక సంఘం కృష్ణమూర్తి, సీపీఎం నాగభూషణం, రజక చైతన్య సంఘం పరమేష్, రజక అభివృద్ధి సంస్థ కమ్మన్న, ఉపాధ్యాయ సంఘం నాయకుడు ఎర్రిస్వామి, సంగాల ఆనంద్, ఈశ్వరయ్య తదితరులతో కలసి దోబీఘాట్ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గురుప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు సునీల్ దత్తారెడ్డి, సోమశేఖర్‌రెడ్డితో కలసి మాట్లాడుతూ.. వాస్తవాలను కప్పిపుచ్చి అధికార పార్టీపై బురదజల్లే ప్రయత్నానికి ఎల్లోమీడియా తెర తీసిందన్నారు. బడుగు, బలహీన వర్గాలను చీల్చే కుట్రలో భాగంగానే దుష్ప్రచారానికి తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2016లో టీడీపీ నాయకుడు వెంకటాచలపతి దోబీఘాట్ స్థలాన్ని లేఔట్‌గా మార్చి ప్లాట్లు వేశాడన్నారు. ఈ అంశంపై తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తొలినాళ్లలోనే దోబీఘాట్ కబ్జాకాకుండా రజకులకు కేటాయించేలా చర్యలు తీసుకున్నారన్నారు. న్యాయవాది హనుమన్న మాట్లాడుతూ.. దోబీఘాట్‌కు కేటాయించిన భూమిని వైఎస్సార్‌సీపీ వాళ్లు కబ్జా చేశారంటూ వెలువడిన కథనంపై మండిపడ్డారు. వాస్తవాలను తెలుసుకోకుండా టీడీపీ నాయకులు స్పందించడం బాధాకరమన్నారు. టీడీపీ నాయకుడు చలపతి అనే వ్యక్తి దొంగగా మిల్కీ పట్టా తెచ్చుకుని ఈ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని చెబుతుంటే పచ్చమీడియాలో మాత్రం అధికార పార్టీ వాళ్లు కబ్జా చేశారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం రజకులను వాడుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యానికి బానిసై ఒకరు.. అనారోగ్య పరిస్థితులను తాళలేక ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు.

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని బీసీ కాలనీ నివాసి రంగస్వామి(40) క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రంగస్వామికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులు ఎంత వారించినా పెడచెవిన పెట్టేవాడు. సోమవారం మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న రంగస్వామి... ఇంట్లో ఎవరూ లేని సమయంలో దాహం వేసి బాటిల్‌లో ఉన్న క్రిమి సంహారక మందు తాగాడు. కాసేపటి తర్వాత ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు... అపస్మారక స్థితిలో పడి ఉన్న రంగస్వామిని గుర్తించి వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై గుత్తి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అనారోగ్య పరిస్థితులను తాళలేక..

గుత్తి రూరల్: అనారోగ్య పరిస్థితులను తాళలేక ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. గుత్తి మండలం పి.ఎర్రగుడి గ్రామానికి చెందిన సులోచనమ్మ(50), బసినేపల్లి గ్రామానికి చెందిన ఫాతిమా(45) కొన్నేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. పలు ఆస్పత్రుల్లో చూపించిన నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సులోచనమ్మ గ్రామ శివారులోని పాడుబడిన బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అలాగే ఫాతిమా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. రెండు ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆర్‌ఎంపీకి దేహశుద్ధి



నారాయణస్వామి

పుట్లూరు: చికిత్స కోసం వచ్చిన మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఆర్‌ఎంపీకి స్థానికులు దేహశుద్ధి చేశారు. వివరాలు... పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటకు చెందిన నారాయణస్వామి... ఆర్‌ఎంపీగా జీవనం సాగిస్తున్నాడు. పుట్లూరు మండలం ఎ.కొండాపురం, పెద్ద పప్పూరు మండలం అమ్మలదిన్నెలో క్లినిక్‌లు నిర్వహిస్తున్నాడు. సోమవారం సాయంత్రం అమ్మలదిన్నెలో ఉన్న క్లినిక్‌కు సమీప గ్రామమైన నామనాంకపల్లి నుంచి ఓ మహిళ వైద్యం కోసం వెళ్లింది. ఆ సమయంలో ఆర్‌ఎంపీ నారాయణస్వామి అసభ్యంగా ప్రవర్తించడంతో అతని చెంప చెల్లుమని వాయించిన ఆమె ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులకు విషయాన్ని తెలిపింది. దీంతో ఆగ్రహించిన కుటుంబసభ్యులు అమ్మలదిన్నె క్లినిక్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే క్లినిక్‌కు తాళం వేసిన నారాయణస్వామి ఎ.కొండాపురంలోని క్లినిక్‌లో ఉన్నట్లుగా తెలుసుకుని అక్కడకు చేరుకుని అందరూ చూస్తుండగా దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న పెద్దపప్పూరు పోలీసులు ఆర్‌ఎంపీ నారాయణస్వామిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నేటి తరం మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలని జిల్లా అధికారులను జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశించింది. మత్తు పదార్థాల వినియోగంపై ఢిల్లీ నుంచి రాష్ట్రంలోని 26 జిల్లాల ప్రభుత్వ అధికారులతో జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సోమవారం వర్చువల్ విధానంలో సమీక్షించింది. స్థానిక జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలు నుంచి డీసీఆర్‌బీ సీఐ విశ్వనాథచౌదరి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ ఆస్పత్రి సైకియాట్రిస్టు శారద, ఐసీడీఎస్ అధికారులు సంధ్యారాణి, చంద్రకళ, నాగలక్ష్మి, సెబ్ అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు తీసుకున్న చర్యలను వివరించారు. పిల్లలు మాదక ద్రవ్యాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంయుక్తంగా యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతు పక్షపాతి సీఎం జగన్





బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత

- శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- ఎ.నారాయణపురంలో ముగిసిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

అనంతపురం రూరల్: విత్తు నుంచి పంట ఉత్పత్తుల మార్కెటింగ్ వరకూ రైతు పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. 'మన ఊరు - మన సంక్రాంతి' కార్యక్రమంలో భాగంగా అనంతపురం మండలం ఎ.నారాయణపురం పంచాయతీలో 'దక్ష కన్‌స్ట్రక్షన్స్' ఎండీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తుంటే ఎల్లో మీడియా, ప్రతిపక్ష నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. యువత విద్యతో పాటు రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం బండలాగుడు పోటీల్లో గెలుపొందిన వృషభాల యాజమానులకు బహుమతులు అందజేశారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి పాల్గొన్నారు.

విజేతలు వీరే..

- న్యూ కేటగిరీలో ప్రథమస్థానాన్ని బోరెడ్డి కేశవరెడ్డి (పెద్దకొట్టాల, నంద్యాల జిల్లా) వృషభాలు, ద్వితీయ స్థానాన్ని కర్నూలు జిల్లా వన్నెదొడ్డి గ్రామానికి చెందిన బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, మద్దిలేటి చెందిన వృషభాలు, తృతీయ స్థానాన్ని బీవీకేఆర్ వృషభాలు (బిల్లాలపురం, నంద్యాల జిల్లా) దక్కించుకున్నాయి. సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని గుడివాడకు చెందిన వెనిగండ్ల రాము వృషభాలు, ద్వితీయ స్థానాన్ని మార్తల చంద్ర ఓబులరెడ్డి (చౌటపల్లి), తృతీయ స్థానాన్ని నల్లగొండ జిల్లాకు చెందిన సుంకి సురేంద్రరెడ్డి వృషభాలు దక్కించుకున్నాయి.



గుంతకల్లు రూరల్: పోలీసులకు పట్టుబడిన జూదరులు



రాప్తాడు: నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

గుంతకల్లు రూరల్: కోడి పందెం ఆడుతున్న పది మంది జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. గుంతకల్లు రూరల్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ సురేష్ తెలిపిన మేరకు... సంకాంత్రిని పురస్కరించుకుని తిమ్మాపురం సమీపంలోని కొండల్లో ఆదివారం సాయంత్రం కోడి పందెలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పోలీసుల రాకను గమనించిన జూదరులు అక్కడి నుంచి పారిపోయారు. దీంతో పోలీసులు వెంటాడి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. జూదరుల నుంచి రూ.12,750 నగదు, 16 ద్విచక్ర వాహనాలు, ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాప్తాడు: కోడి పందెం ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసినట్లు రాప్తాడు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. పట్టుబడిన వారిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఉన్నట్లుగా పేర్కొన్నారు. వీరు అయ్యవారిపల్లి-రాప్తాడు గ్రామాల మధ్యన ఉన్న పండమేరు వంక గట్టున ముళ్ల పొదల్లో కోడి పందెలు నిర్వహిస్తున్నట్లుగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వివరించారు. నిందితుల నుంచి రెండు పందెం కోళ్లు, రెండు కత్తులు, రూ.19,100 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

క్రీడల్లోనూ రాణించాలి



సందీప్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: విద్యతో సమానంగా క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల ఒంగోలులో నిర్వహించిన ఇన్విటేషన్ సౌత్ ఇండియా బాక్సింగ్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించిన సందీప్‌రెడ్డిని సోమవారం ఆయన నివాసంలో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు కృష్ణవేణి పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

అనంతపురం క్రైం: నగరంలోని 47వ డివిజన్ జనశక్తి నగర్‌లో మంగళవారం ఉదయం 6:30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్‌లోని 4వ రోడ్డు నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అధికారులు, వలంటీర్లు హాజరుకావాలని సూచించారు.

అమ్మ సంస్థ ఔదార్యం



చిన్నారులకు నగదు, వస్త్రాలు అందజేస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: శింగనమల మండలం, గురుగుంట్ల గ్రామానికి చెందిన నాగరాజు కొన్నేళ్ల కిందట మరణించగా అతని భార్య లక్ష్మీదేవి ఆ దిగులుతో కన్నుమూసింది. వృద్ధులైన అవ్వతాతలు పిల్లలను పోషించేందుకు ఇబ్బందులు పడ్డారు. 6వ తరగతి చదువుతున్న సుమంత్, మూడో తరగతి చదువుతున్న జ్యోత్స్న అర్ధాంతరంగా చదువు ఆపేయాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి స్పందించి ఆదుకున్నారు. సోమవారం వారికి రూ.20 వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులు, రూ.8 వేలతో నూతన వస్త్రాలు అందించారు. మరో రూ.8 వేలు అందించి వారి చదువు బాధ్యతను పూర్తిగా తీసుకుంటున్నానని భరోసా ఇచ్చారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



అనంతపురం రూరల్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని శిల్పారామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆదివారం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్యం పోటీల్లో చిన్నారులు తమ నృత్యంతో అలరించారు.

పారిశుధ్య పనుల పరిశీలన

అనంతపురం క్రైం: నగరంలోని 4, 5వ రోడ్లు, జనశక్తినగర్, సోమ్‌నాథ్‌నగర్, రంగస్వామి నగర్, తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. వివిధ కూడళ్లలో పేరుకుపోయిన చెత్తను కంపోస్టు యార్డుకు తరలించాలని కార్యదర్శులను ఆదేశించారు.

వెండి సింహాసనం బహూకరణ



సాయినాథుడి సేవలో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్: నగరంలోని మూడవ రోడ్డులో ఉన్న షిరిడి సాయిబాబా మందిరానికి ఆదివారం 45 కేజీల వెండి సింహాసనాన్ని భక్తులు బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంగిరెడ్డి, రఘురామారావు, సాయి, కార్పొరేటర్ చంద్రమోహనరెడ్డి, నగరపాలక స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: జాబ్‌కన్సల్టెన్సీలో నష్టం వచ్చిందని బాధపడుతూ సుశీల్‌రెడ్డి కాలనీకి చెందిన రాజా (32) అనే వ్యక్తి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

సొంతింటి కల సాకారం

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ప్రభుత్వం అర్హులందరికీ ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సామగ్రి, బిల్లులను సకాలంలో మంజూరు చేస్తోంది. లబ్ధిదారులు కూడా ఉత్సాహంగా సొంతింటి కలను నెరవేర్చుకునే దిశగా ముందుకెళ్తున్నారు. దగ్గరుండి పనులు చేయించుకుంటున్నారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఉప్పరపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. లబ్ధిదారులు ఇళ్లను అందంగా ముస్తాబు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలోనే ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే అవకాశం ఉండగా.. పెద్ద ఎత్తున గృహ ప్రారంభోత్సవాలు జరగనున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురము



ఉప్పరపల్లి జగనన్న కాలనీలో తుది దశకు చేరుకున్న ఇళ్ల నిర్మాణాలు

22 నుంచి అనంత షార్ట్ ఫిలిం ఫెస్టివల్

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంతపురం ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి నిర్వహించనున్న 5వ అనంత షార్ట్ ఫిలిం ఫెస్టివల్ (మొబైల్ ఫిల్మ్ మేకింగ్ వర్క్‌షాప్) పోస్టర్లను ఎంపీ తలారి రంగయ్య సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంత వేదికగా జరిగే ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతలో నైపుణ్యాలు కలిగిన యువతకు కొదువలేదన్నారు. షార్ట్ ఫిలిమ్స్‌తో జాతీయ, అంతర్జాతీయ స్థాయి కీర్తిని సాధించుకున్న వారు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. ప్రస్తుతం సెల్‌ఫోన్ ద్వారానే ఎన్నో అద్భుతాలను చిత్రీకరిస్తున్నారన్నారు. ఇలాంటి వేదికల ద్వారా అంతర్జాతీయ స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, అనంత షార్ట్ ఫిలిం ఫెస్టివల్ నిర్వాహకులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

తోపుదుర్తి గ్రామోత్సవానికి తరలిరండి

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తి గ్రామంలో ఈనెల 18వ తేదీన జరగనున్న పెద్దమ్మతల్లి గ్రామోత్సవానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరులు వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి చందు, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఆది, సోమవారాల్లో వారు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేస్తూ.. గ్రామోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈనెల 18వ తేదీన గ్రామంలో ఏర్పాటు చేసిన విందుకు రావాలని కోరారు. ఈనెల 17వ తేదీన పెద్దమ్మ తల్లి గ్రామోత్సవంలో భాగంగా వీరాంజనేయ స్వామికి జ్యోతుల ఊరేగింపు, మధ్యాహ్నం 2 గంటలకు దేవర పోతురాజు ఊరేగింపు, రాత్రి 11 గంటలకు బలిహరణం, ఊరు ప్రదక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 18వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు మంగళహారతి అనంతరం అమ్మవారిని పొలిమేర చేరుస్తామన్నారు.



వేపచెర్ల తండాలో ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న దృశ్యం

26 నుంచి శాంతి సద్భావనా యాత్ర

అనంతపురం కల్చరల్: బంజారాల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 26న పెద్ద ఎత్తున జరిగే శాంతి సద్భావనా యాత్రలో అందరూ భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెండో రోడ్డులోని బంజారా భవన్‌లో ఆల్ ఇండియా బంజరా సేవా సంఘ్ అధ్యక్ష కార్యదర్శులు బాలాజీ నాయక్, బాబూ నాయక్, రాష్ట్ర నాయకులు రంగ్లానాయక్, శేఖర్‌నాయక్, ధరమ్‌సింగ్‌నాయక్, కృష్ణానాయక్ తదితరులు పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సేవాఘడ్‌లో జరిగే జయంతి ఉత్సవాలకు దేశవ్యాప్తంగా భక్తులు తరలి వస్తారన్నారు. ఈనెల 17న సాయంత్రం 3:30 నుంచి రాత్రి వరకూ నగర వీధుల్లో శాంతి యాత్ర సాగుతూ ఆదర్శనగర్, నాయక్‌నగర్ తదితర చోట్ల ఉన్న బంజారాల దేవతా స్వరూపాల వద్ద ప్రత్యేక సంఘీభావ పూజలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 15 వరకూ వేడుకలు జరుగుతాయన్నారు. వేడుకలకు బంజారాల గురువు రాజస్థాన్ నుంచి చేతన్‌గిరి మహారాజ్ విచ్చేస్తున్నారని తెలిపారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బంజారా సేవా సంఘ్ నాయకులు

19న వేమన జయంతి

అనంతపురం కల్చరల్: స్థానిక వేమన ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజాకవి వేమన జయంతి ఉత్సవాల పోస్టర్లను మాజీ వీసీ ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈనెల 19న రాష్ట్ర వ్యాప్తంగా వేమన జయంతి అధికారికంగా జరుగుతుండటం సంతోషకరమన్నారు. అందులో భాగంగా వేమన ఫౌండేషన్ తరఫున జిల్లాలో ఎంపిక చేసిన 100 పాఠశాలల్లో వేమన పద్యపోటీలు జరుగుతాయని తెలిపారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వేమన ఫౌండేషన్ సభ్యులు

దంపతులు.. భలే దొంగలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆటోలో వెళుతూ ప్రయాణికులను మోసగించి చోరీలకు పాల్పడుతున్న దంపతులను అనంతపురం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ రవిశంకరరెడ్డి వెల్లడించారు. అనంతపురంలోని నాయక్‌నగర్‌లో నివాసముంటున్న మురళి, జ్యోతి దంపతులు. భర్త ఆటో నడుపుతుండగా తోడుగా భార్య కూడా వెళుతుంది. సాధారణ ప్రయాణికురాలిగానే ఆటోలో ప్రయాణిస్తూ నిర్మానుష్య ప్రాంతానికి చేరుకోగానే ప్రయాణికుల వద్ద ఉన్న విలువైన వస్తువులు అపహరించుకెళ్లేవారు. ఇటీవల ఒంగోలుకు చెందిన వెంకట్రావు ఆర్టీసీ బస్టాండు సమీపంలో వీరి ఆటో ఎక్కాడు. గుత్తి రోడ్డు వైపుగా వెళుతున్న ఆటోను అటుగా ఉన్న ముళ్లపొదల్లోకి మురళి మళ్లించాడు. అనంతరం భార్యతో కలసి వెంకట్రావును బెదిరించి సెల్‌ఫోన్‌తో పాటు రూ.12 వేలు లాక్కొని ఉడాయించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో దంపతులిద్దరినీ సోమవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వాల్మీకి ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



ఉద్యోగులతో కలసి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీ తలారి రంగయ్య సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముషాయక్ జిల్లా కమిటీ ఎన్నిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఏపీ రాష్ట్ర ముషాయక్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జకావుద్దీన్ సాహెబ్ ఆదేశాలతో స్థానిక రాంనగర్‌లో ఏపీ, కర్ణాటక ముషాయక్ బోర్డు ఇన్‌చార్జ్ హఫీజ్ అబ్దుల్ మాలిక్ ఆధ్వర్యంలో ఆదివారం ముషాయక్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రోషన్ జమీర్ ఖాద్రీ, జిల్లా ఇన్‌చార్జ్‌గా అబ్దుల్ మజీద్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. ముషాయక్ కమిటీ ఆదేశాల మేరకు జిల్లాలో ముషాయక్ కమిటీని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో అలీ, మొయినుద్దీన్, అబ్బాస్, గౌస్‌పీర్, మత పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజలు



గోపూజలు నిర్వహిస్తున్న టీటీడీ సిబ్బంది

అనంతపురం కల్చరల్: స్థానిక మూడవ రోడ్డులోని వాదిరాజ శ్రీకృష్ణ మఠంలో తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం గోపూజలు, కనుమ విశిష్టతను తెలిపే ప్రవచనాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అనంతరం ప్రముఖ సంస్కృత పండితుడు దుర్భాక వాసుదేవశాస్త్రి ఆధ్యాత్మిక ప్రవచనంలో సంక్రాంతి పర్వదినాల్లో కనుమ గొప్పతనం పశుసంపదతో కూడి ఉంటుందని వాటికి ఇటీవల టీటీడీ మరింత ప్రోత్సాహం ఇస్తోందన్నారు. కృష్ణుడికి ప్రత్యేక అలంకార సేవలు చేసి, భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు లక్ష్మీనారాయణాచార్, టీటీడీ సిబ్బంది పండిట్ వేణు, వరప్రసాద్, సుధామణి తదితరులు పాల్గొన్నారు.

మద్దెలచెరువులో నేడు ఊరు దేవర

కనగానపల్లి: మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో మంగళవారం పెద్దమ్మ, పోతలయ్య స్వాముల ఊరు దేవర (జాతర) నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సుమారు 60 సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఈ జాతరలో పాల్గొనేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జనం చేరుకుంటున్నారు. సోమవారం గ్రామంలోని ఆంజనేయస్వామికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

నేరస్తులపై నిరంతర నిఘా

- పాత నేరస్తుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్
- రైల్వే ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాలలో రంగంలోకి జీఆర్పీ పోలీసులు
- అనుమానితుల నుంచి వేలిముద్రల సేకరణ



అనంతపురం రైల్వే స్టేషన్‌లో ఓ యువకుడి నుంచి వేలిముద్రలు సేకరిస్తున్న జీఆర్పీ పోలీసులు

అనంతపురం సిటీ: రైళ్లు, రైల్వే స్టేషన్లలో నేరాలను తగ్గించేందుకు, మోసగాళ్ల ఆటలు కట్టడి చేసేందుకు జీఆర్పీ పోలీసులు రంగంలోకి దిగారు. గుంతకల్లు డివిజన్ రైల్వే ఎస్పీగా కె.చౌడేశ్వరి బాధ్యతలు చేపట్టాక.. నేరాలను తగ్గించడం, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచడం, అనుమానితులను గుర్తించడం వంటి అంశాలపై అన్నీ రైల్వే పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు జారీ చేశారు.

ముమ్మరంగా వేలిముద్రల సేకరణ

అనంతపురం రైల్వే స్టేషన్‌తో పాటు పరిసరాల్లో స్థానిక జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్ తమ సిబ్బందితో కలసి పాత నేరస్తులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. పనిలో పనిగా అనుమానితులనూ గుర్తించి, వారి నుంచి వేలిముద్రలను సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని సోమవారం రాత్రి ఆయన 'సాక్షి'కి తెలిపారు.

దొంగల ఆటకట్టించేందుకే..

కరోనా, లాక్‌డౌన్ పరిస్థితుల అనంతరం రైళ్లు, రైల్వే స్టేషన్లలో వివిధ రకాల నేరాలు ఎక్కువయ్యాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'జీరో క్రైం' కింద గుంతకల్లు డివిజన్‌ను నిలపాలని సంకల్పించి ఎస్పీ చౌడేశ్వరి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. రైళ్ల రద్దీ సమయంలోనూ తమ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఒక్కరి కదలికలను గమనిస్తూ ఉంటారని పేర్కొన్నారు. ప్రయాణికులు కూడా ఈ విషయాన్ని గమనించి, పాత నేరస్తులు గానీ, అనుమానితుల సమాచారాన్ని తమకు తెలియజేస్తే వెంటనే తాము స్పందిస్తామని హామీ ఇచ్చారు.

సంక్రాంతి సందడి

ఆత్మకూరు/రాప్తాడు/అనంతపురం కల్చరల్/కనగానపల్లి: అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల్లో సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. తెలుగు వారి సంస్కృతికి అద్దం పట్టే కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా జరిగాయి. ఇంటింటా సాగిన అందమైన ముత్యాల ముగ్గులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వన విహారాలు, విందు వినోదాలకు నగర శివార్లలోని కళాక్షేత్రాలు, పార్కులు వేదికలయ్యాయి. వందలాదిగా వచ్చిన సందర్శకులు ఉదయం నుండి సాయంత్రం వరకు సందడి చేసారు. అలాగే ఆలయాలలో మకర పూజలు, కనుమ నాడు గోపూజలు జరిగాయి. ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామంలో ఎస్వీ యూనివర్సిటీ బోర్డు మెంబర్ తోపుదుర్తి నయనతారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సతీమణి తోపుదుర్తి మనోరమ బంధువులతో కలసి గాలిపటాలు ఎగరవేస్తూ సందడి చేశారు. పంపనూరులోని సర్ప రూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



తోపుదుర్తిలో గాలిపటాలు ఎగురవేస్తున్న తోపుదుర్తి నయనతారెడ్డి, తోపుదుర్తి మనోరమ

తపోవనంలోని శివశక్తి సాయిమందిరంలో రథోత్సవం ఘనంగా జరిగింది. వందలాది మంది భజన బృందాలతో 45 కి.మీ వరకూ రథయాత్ర సాగింది. నిర్వాహకులు విజయ్‌సాయి, శ్రీరాముల నేతృత్వంలో గొట్లూరు, ఉరవకొండ వరకు భజన బృందాలతో సాగిన రథోత్సవానికి భక్తులు అడుగు నీరాజనాలర్పించారు. ఆర్‌ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, శివబాలయోగి ఆశ్రమం, అశోకనగర్‌లోని సత్యదేవుని ఆలయం, పాతూరులోని ప్రాచీన చెన్నకేశవస్వామి ఆలయం తదితర చోట్ల ధనుర్మాస పూజలు గోదాదేవి పూజోత్సవాలతో ఘనంగా ముగించారు. పలు చోట్ల పెద్ద ఎత్తున అన్నదానాలు జరిగాయి.



అనంతపురం కల్చరల్: తపోవనం నుంచి సాగుతున్న రథోత్సవం



రాప్తాడు: చిన్మయనగర్‌లో ఇంటి ముందు వేసిన ముగ్గు

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు

రామగిరి: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ జనార్ధన్ నాయుడు హెచ్చరించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మండలంలో తరచూ ఆటో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రతి ఆటోకు రేడియం స్టిక్కర్ అతికించుకోవాలన్నారు. ఆటోలకు నంబర్లు కేటాయిస్తామన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే క్షతగాత్రులను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రూ.లక్షలతో కొనుగోలు చేసి.. వృథాగా వదిలేసి

అనంత నగరాన్ని హరిత నగరంగా మార్చాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా.. నగరపాలక సంస్థ అధికారుల్లో ఎటువంటి మార్పు కనిపించడం లేదు. రూ.లక్షల ప్రజాధనంతో కొనుగోలు చేసిన వందలాది మొక్కలను అలంకార ప్రాయంగా ఉంచేశారు ఇంజినీర్లు. నగరంలోని అత్యంత ప్రజాదరణ కల్గిన రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్‌లో వివిధ రకాల మొక్కలను గత ఆరు నెలలుగా మూలకు పడేశారు. నగరంలో ఖాళీగా ఉన్న డివైడర్ల మధ్య, రోడ్డుకు ఇరువైపులా, వివిధ పార్క్‌ల్లో వాటిని నాటించే ప్రయత్నం చేయడం లేదు. పార్క్‌ల్లో పని చేసే సిబ్బందితో వాటిని నాటిస్తే పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతాయి. ఇప్పటికైనా నగరపాలక సంస్థ ఇంజినీర్లు మేలుకుంటారో లేదో వేచి చూడాలి. – అనంతపురం క్రైం:



రాజీవ్ చిల్డ్రన్ పార్క్‌లో ఎండిపోయిన మొక్కలు



పార్క్‌లో మూలన పడేసిన మొక్కలు

నయనానందకరం



బుక్కరాయసముద్రంలోని ఉద్యానవనం పలు రకాల పూల మొక్కలతో కళకళలాడుతోంది. పచ్చదనం నిండటంతో ఉద్యానవనం చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. ఉద్యానవనానికి వెళ్లే దారిలో ఇరువైపులా ఉన్న ఓ రకం మొక్కల పూలు విరగ్గాశాయి. పసుపు రంగులో ఉన్న పుష్పాలు అమితంగా ఆకట్టుకున్నాయి. ఓ పిచ్చుక పుష్పాలపై వాలిన దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురము